## క్లుప్తంగా

### 9న లోక్ అదాలత్

కమలాపురం : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. రాజీ ధోరణిలో ఉన్న ఇరు వర్గాల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

### ఇంటి వద్దకే వైద్యం


గ్రామంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, ఏఎన్ఎంలు

సింహాద్రిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి నిరుపేదకు కార్పొరేట్ ఆసుపత్రులు అందించే వైద్యం వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ ద్వారా అందిస్తున్నామని వైద్యురాలు అయిషా అన్నారు. శనివారం బిదినంచెర్ల ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలైన దేవతాపురం, జంగంరెడ్డిపల్లెలో వైద్యురాలు అయిషా ఆధ్వర్యంలో ఇంటింటికి వైద్యం నిర్వహించారు. మంచానికి పరిమితమై నడవలేని వారికి, వృద్ధులకు ఎలాంటి ప్రయాసాలు పడకుండా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఇంటి వద్దకే వైద్యం అనే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా ఇందులో పలువురికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ, దిల్షాద్, డీఈఓ సౌభాగ్య, ఏఎన్ఎం సుభాషిని, ఆశ కార్యకర్త చంద్ర, శోభ, హెల్త్ అసిస్టెంట్ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

### 18న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం రాష్ట్ర సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 18న జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. శనివారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి 9 సంవత్సరాలు అయినా నేటికి ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఉక్కు పరిశ్రమ సాధన కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సుకు అన్ని రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షాకీర్, విజయ్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం చేపడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యను పూర్తిగా మార్చే విధంగా కుట్ర పన్నుతోందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించి ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, నగర అధ్యక్షుడు అరుణ్, నాయ కులు పాల్గొన్నారు.

### ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం

కడప స్పోర్ట్స్: కడప లోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, నెహ్రూ యువకేంద్ర అధికారి మణికంఠ, క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డిలు విచ్చేసి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ యువతకు 'గీన్ స్కిల్స్ : స్థిరమైన ప్రపంచం వైపు' అన్న నినాదంతో ఈ యేడాది అంతర్జాతీయ యువజన దిన్సోతవం జరుపుకుంటున్నామన్నారు. స్వామి వివేకానందున్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సాంకేతికతను మంచి కోసం వినియోగించుకోవాలన్నారు. అనంతరం 'నాభూమి.. నా దేశం' కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు.

### శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధిక శ్రావణ మాసం 3వ శనివారం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం , పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్య స్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావదినోత్సవం

ఎర్రగుంట్ల : ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ 88వ దినోత్సవ వేడుకలను శనివారం ఎర్రగుంట్ల ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు లీలాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# అధిక విస్తీర్ణంలో పత్తిపంట సాగు

- గ్రామాల్లో కూలీలకు పెరిగిన డిమాండ్
- రోజుకు ఒక్క కూలీకి రూ.400లు ఇస్తున్న వైనం
- పత్తి ధరలపై రైతులలో ఆందోళన


పత్తి పంటలో పత్తిని తీస్తున్న కూలీలు

వేముల : గ్రామాల్లో పత్తి పంటలో పత్తి తీసే పనులు ఊపందుకున్నాయి. వేసవి పంటగా పత్తి పంటను రైతులు సాగు చేసుకున్నారు. పులివెందుల నియోజకవర్గంలో అధిక విస్తీర్ణంలో పత్తి పంట సాగైంది. పత్తి పంటలో పత్తి తీసే పనులు చురుగ్గా సాగుతుండటంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. గ్రామాల్లో ఉన్న కూలీలు సరిపోవడంలేదు. దీంతో గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడటంతో ఇతర గ్రామాల నుంచి కూలీలను పిలిపించి ఒక్కో కూలీకి రోజుకు రూ.400లు చెల్లించడంతోపాటు ఆటో బాడుగను ఇస్తున్నారు. 10కిలో మీటర్లు దాటితే ఆటో బాడుగ రూ.1000ల నుంచి రూ.1200ల వరకు ఇవ్వాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే గత నెల రోజులుగా గ్రామాల్లో పత్తి తీసే పనులు ఉండటంతో కూలీలకు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. గ్రామాల్లో ఒకేసారి సాగులో దిగుబడులు అందడంతో నెలకొందని రైతులు అంటున్నారు.

**పత్తి సాగులో పెరిగిన పెట్టుబడులు :**
ఈ ఏడాది పత్తి సాగులో పెట్టుబడులు పెరిగిపోయాయి. పంట సాగుకు భూములలో సేద్యాలు చేయడం, పంట సాగు అనంతరం పంటలో కలుపు తీత, ఎరువులు, పురుగు మందులకు, పత్తి తీసే కూలీలకు కలుపుకుని ఎకరాకు రూ.30 వేల మేర పెట్టుబడులు అయ్యాయని రైతులు చెబుతున్నారు. పంట సాగు చేసిన తర్వాత పంటకు తెగుళ్ల సోకకుండా మంజూరు జాగ్రత్తగా రైతులు మందుల పిచికారి చేశారు. పంటలో దిగుబడులు అందే సమయానికి ఒక్కో రైతు నాలుగైదు సారుల మందులను పిచికారి చేయాల్సి వచ్చింది. పంటలో నాలుగైదు సార్లు కలుపు తీయాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడులు పెరిగిపోవడం, దిగుబడులు తగ్గడంతో నష్టాలు వస్తున్నాయని రైతులు అంటున్నారు.

**నియోజకవర్గంలో 10 వేల ఎకరాల్లో సాగు.. :**
పులివెందుల నియోజకవర్గంలో పత్తి పంట 10 వేల ఎకరాలలో సాగైనట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. నియోజకవర్గంలో ఎక్కువగా వేముల, వేంపల్లె, తొండూరు, చక్రాయపేట మండలాల్లో సాగు చేసుకున్నారు. ఎక్కువగా సూపర్ బంటి, ప్రాపిట్ ప్లస్, వర్థిని గోల్డ్, నందిని, రాశి, అఖండ తదితర రకాలను సాగు చేసుకున్నారు. పత్తి పంట కాలం ఆరు నెలలు ఉంటుంది. సాగు చేసిన వంద రోజుల నుంచి దిగుబడులు చేతికొస్తాయి. గత ఏడాది వర్షాలు ఉండటంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు పత్తిని సాగు చేసుకున్నారు.

**ధరలపైనే రైతులలో ఆందోళన... :**
పత్తి ధరలతో రైతులలో ఆందోళన చెందుతున్నారు. పంటలలో దిగుబడులు చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధరలు పడిపోయాయి. గత ఏడాది క్వింటా పత్తి రూ.10,800లు ఉండగా.. ఈ ఏడాది రూ.7 వేలకు మించి ధరలు లేవు. దీంతో రైతులు సాగులో పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గి ధరలు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. కొంతమంది రైతులు పత్తి దిగుబడులు అమ్ముతుండగా.. మరి కొంతమంది రైతులు ధరల కోసం ఎదురుచూస్తున్నారు. మరి ధరలు ఏ మేరకు పెరుగుతాయో వేచి చూడాల్సిందే.

**సాగులో పెట్టుబడులు పెరిగాయి**



ఈ ఏడాది పత్తి సాగులో పెట్టుబడులు పెరిగాయి. నాకున్న 3 ఎకరాలలో పత్తి సాగుచేశా. ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు పెట్టా. పత్తి తీసే పనులకు కూలీలు దొరకక ఇబ్బందులు పడ్డా. ఇతర గ్రామాల నుంచి కూలీలను తరలించి పత్తి తీస్తున్నాం.

– చంద్రఓబుళరెడ్డి (పత్తి రైతు), గొందిపల్లె

**ధరలు లేక నష్టపోతున్నాం**



ఈ ఏడాది పత్తి ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నాం. గత ఏడాది క్వింటా పత్తి రూ.10,800 అమ్ముకున్నాం. ఈ ఏడాది క్వింటా పత్తి రూ.7వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరలతో పత్తి అమ్ముకుంటే నష్టపోతాం. ధరలు వస్తాయనే ఆశతో ఉన్నాం.

– చంద్రమోహన్‌రెడ్డి (పత్తి రైతు), గొందిపల్లె

### 19 నుంచి పాలకొండ్రాయునికి శ్రావణమాస పూజలు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని శ్రీ పాలకొండ్రాయస్వామి క్షేత్రంలో ఈనెల 19నుంచి శ్రావణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ జేసు వెంకట సుబ్బారెడ్డి, పాలక మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ మాసంలో మొదటి శ్రావణ శనివారం సందర్భంగా 19న శ్రీ పాలకొండ్రాయస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, సర్వదర్శనం ఉంటాయన్నారు. రెండవ శనివారమైన ఈనెల 26న స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. మూడవ శనివారమైన సెప్టెంబరు 2న ఉదయం11 గంటలకు క్షేత్ర ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. నాల్గవ శనివారం సెప్టెంబరు 9న ఆలయ ప్రాంగణంలో మహా సుదర్శన హోమం తదితర పూజలు ఉంటాయన్నారు. నాలుగు వారాలు దాతల ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని వివరించారు.

### పోటీల్లో విజేతల ఎంపిక

మైదుకూరు : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మైదుకూరులో శనివారం విద్యార్థులకు మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలను ఎంపిక చేశారు. ఉత్తమ చేతి రాత, 1947 తర్వాత భారత గెలుపు కథ, ఎన్నికలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఎంపికై న వారు ఆదివారం బద్వేలులో డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎల్లారెడ్డిపల్లె సచివాలయం పరిధిలోని దాదిరెడ్డిపల్లె, ఎల్లారెడ్డిపల్లె, చెన్నారెడ్డిపల్లె గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఇంకా పథకాలు రానివారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా మారిందన్నారు. దాదిరెడ్డిపల్లెలో కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న మహిళలతో ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. అలాగే దాదిరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తూ రిటైర్డ్ అయిన దండుబోయిన నాగమ్మ అనే వృద్ధురాలికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అరియర్స్‌ను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రవిశంకర్, చెన్నారెడ్డి, సుబ్బరాయుడు, నాగేంద్ర, వీరభద్ర, భాస్కర్, హరి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, గండి భాస్కర్, ఎన్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, కృష్ణారెడ్డి, మస్తానయ్య, నిఖిల్‌రెడ్డి, పెద్దచెప్పలి చిన్ని, సుబ్బారెడ్డి, శేఖర్, గౌస్, సుబ్బన్న, చంటి, చంద్రపాల్, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

### డైరీ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్‌కు సంబంధించిన డైరీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు తమ రోజు వారి కార్యక్రమాలు రాసుకునేందుకు ఈ డైరీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలకు డైరీ పంపిణీ చేస్తామన్నారు. నాయకులు నాగరాజారెడ్డి, అగ్గిరప్పయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నగురువళూరులో 125 మందికి వైద్య పరీక్షలు

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరులో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో 125 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఓబులేసు తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి వైద్య పరీక్షలు నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి వైద్య సిబ్బందితో కలసి ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి తెలిపారు.

# గండి ఉత్సవాల గోడపత్రాలు ఆవిష్కరణ


గండి ఉత్సవాల గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి

చక్రాయపేట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా గోడపత్రాలను శనివారం పులివెందులలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆలయ అధికారి అలవల పాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి స్వామి, పాలకమండలి సభ్యులు అందరూ సమష్టి కృషితో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. తగిన పోలీసు బందోబస్తుతో పాటు, క్యూలైన్ల ఏర్పాటు విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తొండూరు మండల ఇన్‌చార్జ్ వైఎస్ మధురెడ్డి, పాలక మండలి సభ్యులు రామాంజులరెడ్డి, అనూషతేజ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత స్థానాలను అధిరోహించాలి


మాట్లాడుతున్న స్థైర్యానంద సరస్వతి స్వామి

కమలాపురం : ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని శ్రీ స్థైర్యానంద సరస్వతి స్వామి తెలిపారు. శనివారం స్థానిక ఎయిమ్ ఫర్ సేవ వ్యవస్థాపకులు శ్రీ స్వామి దయానంద సరస్వతి జయంతితో పాటు 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీసీపీఎల్ సీఎంఓ సాయి రమేష్, చీఫ్ మేనేజర్ భార్గవ్‌రెడ్డితో కలసి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ దయానంద సరస్వతి స్వామిజీ దేశంలో ఇలాంటి ఎయిమ్ ఫర్ సేవ కేంద్రాలు అనేకం స్థాపించారన్నారు. అనాథలను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించి సమాజంలో ఉన్నత స్థానాల్లో చేర్పించే విధంగా ఈ సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. విద్యతో పాటు ఆధ్యాత్మికతను కూడా నేర్పించే ఇలాంటి సంస్థలు అభివృద్ధి చెందాలంటే దాతల సహకారం తప్పనిసరి అన్నారు. గత 15 ఏళ్లుగా కమలాపురంలో ఈ సంస్థ నిర్వహించడం సంతోషకరమన్నారు.అలాగే ఇక్కడ చదివి వివిధ ప్రాంతాల్లో ఉపాధి పొందిన విద్యార్థులందరూ ఈ రోజు ఇక్కడ కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అయితే మీరు చదువుకున్న ఈ సంస్థ అభివృద్ధికి మీరు కూడా సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాధు గోపాలకృష్ణ, సీవీ రాజగోపాల్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు రాజారెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, నిఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఎరువులు


చాపాడు రైతు భరోసా కేంద్రంలోని ఎరువులు

చాపాడు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకునే రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉంచుతున్నట్లు మండల వ్యవసాయాధికారి మ్యాగి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో యూరియా, పాస్ఫేట్ ఎరువులు ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా పలు చోట్ల రైతులు నారుమళ్ల సాగు చేసుకుంటుండగా, కుందూనది పరీవాహక ప్రాంతాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సమాయాత్తమవుతున్నారు. ఇప్పటికే అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, రాజువారిపేట, సీతారామాపురం, చాపాడు, ఖాదర్‌పల్లె గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. ఇదే క్రమంలో మండలంలోని సీతారామాపురం, శ్రీరాములపేట, కుచ్చుపాప, అల్లాడుపల్లె, పెద్దగురువళూరు గ్రామాలలో ఇప్పటికే పసుపు సాగు చేశారు. ఈ పంటల సాగు కోసం రైతులకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉన్నాయని, ఎరువులు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డులతో రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

# హర్ ఘర్ తిరంగాను జయప్రదం చేయండి


వేంపల్లెలో జాతీయజెండాలను ఆవిష్కరించి ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు


వల్లూరు : వివిధ వేషధారణలలో కడప, పుష్పగిరి చరిత్రను వివరిస్తున్న విద్యార్థులు


మొక్కలు నాటుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి

వేంపల్లె : అజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో స్థానిక బీజేపీ నాయకులతో కలసి బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరిప్రసాద్ జాతీయ జెండాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయజెండా అనేది కులం, మతం వర్గం అన్న తేడాలేకుండా ప్రతిఒక్కరూ తమ ఇళ్లపై ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జాతీయజెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఎందరో మహానుభావులు బలిదానం వల్ల మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.సుస్మా, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో స్వచ్ఛత**
మేరామట్టి–మేరాదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆర్కెవ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో శనివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్–2 ఆధ్వర్యంలో వలంటీర్లు క్యాంపస్‌లోని పరిసరాలను శుభ్రం చేశారు. ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు జాతీయ సేవాసమితి విభాగాలు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్–2 ప్రోగ్రాం అధికారి రత్నకుమార్ అన్నారు. మొక్కలు నాటడం, వాటి ఆవస్యకత, పర్యావరణ పరిరక్షణ, మట్టి యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కోటేశ్వరి, అధ్యాపకులు డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

**విద్యార్థులకు పోటీలు**
చెన్నూరు : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుని మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం వివిధ పాఠశాల విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణీతలుగా మండలంలోని రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, అలాగే చిన్నమాచుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివుడు వ్యవహరించారు.

**మేరా మిట్టి మేరా దేశ్ మేరా కడప మహాన్**
వల్లూరు : మేరా మిట్టి.. మేరా దేశ్.. మేరా కడప మహాన్ హై అని ఆశారేఖ ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి తెలిపారు. శనివారం మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ వేషధారణలో విద్యార్థులు పుష్పగిరికి వచ్చి కడప చరిత్రను వివరించారు. అక్కడికి వచ్చిన ప్రజలకు ఘన చరిత్ర కలిగిన పంచనది సంగమం విశిష్టతను, పుష్పగిరిలో వెలసిన శివుడు, చెన్నకేశవ స్వామి వారి ప్రాముఖ్యతను అలాగే ఆది శంకరాచార్యులు ప్రతిష్టించిన శ్రీ చక్రం విశిష్టతను, ఆలయం ప్రాముఖ్యతను అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వలంటీర్లు ఆచారి, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

**త్యాగమూర్తులను స్మరించుకోవడం మన బాధ్యత**
పెద్దముడియం : దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని జమ్మలమడుగు మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దపసుపుల, పెద్దముడియం, బోడుతిప్పలపాడు, పాలూరు, బలపనగూడూరు, జె.కొత్తపల్లె గ్రామాలలో నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి,ఎంపీడీవో వెంకటరమణయ్య, ఏపీవో హరికృష్ణ, గ్రామ సర్పంచ్‌లు, ఉపాధి సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో అవకతవకలు

బ్రహ్మంగారిమఠం : మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీపథకం కింద గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన పనులపై 11 గ్రామ పంచాయతీలలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆడిట్ నివేదికలపై శనివారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఇందులో ఈజీఎస్, పీఆర్, ఎస్ఎస్ఏ, టి.ఫారెస్ట్, 583 పనులకు 75కోట్ల 06 లక్షల 72వేల 202 రూపాయలు ఖర్చుచేయగా అందులో పీఆర్ కేటాయించిన నిధులలో అవకతవకలు జరిగినట్లు ఆడిట్‌లో గుర్తించామని పరిశీలకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధి అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, డీవీఓ యోగాంజనేయరెడ్డి, ఏపీడీ మైథిలీ, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఏపీఓ డాక్టర్ వసంతకుమార్, ఎస్ఆర్‌పీ మూర్తి, ఉపాధి సిబ్బంది, పలు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

### రతనాల వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, లలితాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## వర్షం.. హర్షం

పెద్దముడియం : కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ మొదటలో సాగు చేసిన మొక్కజొన్న, సోయాబిన్, మినుము, కంది పంటలకు కురిసిన వర్షం ఊరటనిచ్చింది. మోస్తరు వర్షం కురవడంతో మిరప పంట సాగు చేసే రైతులు మిరప నారును కూలీల చేత పొలాల్లో నాటిచ్చే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.


మిరప నారును నాటుతున్న కూలీలు


పచ్చగా కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

# ఉచితంగా కృత్రిమ కాలు, చేయి


కృత్రిమ కాలు కోసం కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేటలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శనివారం దివ్యాంగులకు ఉచితంగా జైపూర్ కృత్రిమ కాలు, చేయి అమర్చేందుకు కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్‌పర్సన్ కళావతి, కో చైర్మన్ రామచంద్రుడు మాట్లాడుతూ హుబ్లీకి చెందిన ఆల్ ఇండియా జైన్ యూత్ ఫెడరేషన్, మహావీర్ లింబ్ సెంటర్ సహకారంతో ఉచితంగా దివ్యాంగులకు కృత్రిమ కాలు, చేయి అమర్చుతున్నట్లు తెలిపారు. శ్రీసన్నుతి శ్రీనివాసులు అండ్ సన్స్, హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి వినాయక ఫార్మ, శ్రీసిద్ధి వినాయక ఫార్మ, ప్రొద్దుటూరుకు చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా వారి ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో 75 మంది దివ్యాంగులను పరీక్షించి కొలతలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు సన్నుతి శ్రీనివాసులు, అధ్యక్షుడు చిట్టెం రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు ప్రకాష్, కార్యదర్శి రమేష్, సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# మెనూ పాటించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు మెనూ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు పేర్కొన్నారు. శనివారం ఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వసతిగృహాలను సందర్శించి వసతిగృహ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకులు లోకేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.